


# మన దునియా

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.


మన దునియా

సంప్రదించండి...
9490056011,9603969335



సంపుటి : 3 | సంచిక : 223 | ఫిబ్రవరి 27 శుక్రవారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-



## జర్నలిస్టులపై అక్రమ అరెస్టులు నిలిపివేయాలి




# పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

షేక్ ఇస్మాయిల్, రిపోర్టర్ క్విక్ టుడే న్యూస్ - పత్రికా స్వేచ్ఛపై పెరుగుతున్న ఆంక్షలు - విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులపై కేసుల ముప్పు - రాజ్యాంగ హక్కుల పరిరక్షణ అవసరం- ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర కీలకం

అధికార దుర్వినియోగంపై ప్రశ్నించే స్వరాలు - జర్నలిస్టుల భద్రతపై ఆందోళన - అక్రమ అరెస్టులపై ఖండన - ఐక్యంగా శాంతియుత నిరసనకు పిలుపు - “కలం ఆగితే నిజం ఆగుతుంది” - మీడియా స్వేచ్ఛ కాపాడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుంది

## రేవంత్‌కు బడ్జెట్ సవాల్.. ఆ రెండు పథకాలే సమస్య!

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 26**



తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు దాటుతున్న తరుణంలో, పాలన ఇప్పుడు ఒక కీలక మలుపు వద్ద నిలబడింది. ఇన్నాళ్లూ నెట్టుకొచ్చిన హనీమూన్ పీరియడ్ ముగిసి, ఇప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలపై జవాబు చెప్పాల్సిన అసలు సమయం వచ్చింది. ముఖ్యంగా సంక్షేమ పథకాల చుట్టూ తిరిగే రాజకీయాల్లో ఈ వచ్చే బడ్జెట్ రేవంత్ సర్కార్‌కు ఒక అగ్నిపరీక్ష లాంటిది.కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమైన ఆరు గ్యారెంటీల్లో కొన్ని ఇప్పటికే అమలవుతున్నా , భారీ ఆర్థిక భారంతో కూడిన అసలు పథకాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ముఖ్యంగా వృద్ధాప్య పింఛన్లను 4,000 రూపాయలకు పెంచడం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2,500 రూపాయల నగదు బదిలీ వంటివి కోట్లాది

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం: కేటీఆర్

**వెలుగుమట్ల భూదాన్ భూ బాధితులను కలిసిన కేటీఆర్**

**పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చేశారని మండిపాటు**




ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో భూదాన్ భూ బాధితులను బీఆర్ఎస్ వర్కింగ్

## భారత్ సొంతమైన ఇజ్రాయెల్ ‘ఐరన్ డోమ్‘

**మన దునియా ముంబై: ఫిబ్రవరి 26**



ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య రక్షణ సహకారాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో, ఇజ్రాయెల్ తన అత్యంత శక్తివంతమైన ‘ఐరన్ డోమ్‘

## వయనాడ్‌లో 100 ఇళ్లు... శంకుస్థాపన వేళ సరదా అంశం పంచుకున్న రాహుల్ గాంధీ

**వయనాడ్ కొండచరియల బాధితులకు 100 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన**

**వయనాడ్ ప్రజల కుటుంబంలో ఒకరినయ్యానని చెప్పిన ప్రియాంక గాంధీ**

**40 మంది దుకాణదారులకు రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటన**

**వయనాడ్‌తో తమది రాజకీయాలకు అతీతమైన బంధమని స్పష్టం చేసిన రాహుల్**



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# రేవంత్‌కు బడ్జెట్ సవాల్.. ఆ రెండు పథకాలే సమస్య!

**(మొదటి పేజీ తరువాయి)**

మంది లబ్ధిదారుల జీవితాలతో ముడిపడి ఉన్నాయి. ఈ రెండు పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి ప్రారంభించకపోతే, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ వ్యతిరేకతను ఆపడం రేవంత్ రెడ్డికి సాధ్యం కాకపోవచ్చు.

విపక్షాల అస్త్రం ప్రజల నిరీక్షణ

ప్రతిపక్ష బిఆర్ఎస్ ఇప్పటికే ఈ అంశాన్ని రాజకీయ అస్త్రంగా మార్చుకుంది. సగం పదవీకాలం ముగిసినా హామీలు ఎక్కడ అంటూ కేటీఆర్ వంటి నేతలు నేరుగా ముఖ్యమంత్రికే లేఖలు రాస్తున్నారు. మరోవైపు, ప్రజల్లో కూడా నిరీక్షణ హద్దులు దాటుతోంది. ప్రభుత్వం కేవలం బడ్జెట్ కేటాయింపులతో సరిపెడుతుందా లేదా నిజంగానే నగదును లబ్ధిదారుల ఖాతాల్లోకి మళ్లిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ బడ్జెట్‌లో వీటికి స్పష్టమైన కేటాయింపులు లేకపోతే, అది ప్రత్యర్థులకు రాజకీయంగా పెద్ద వరంలా మారుతుంది. రాష్ట్ర ఖజానాపై ఉన్న అప్పుల భారం, కేంద్రం నుంచి అందాల్సిన నిధుల్లో కోతలు రేవంత్ రెడ్డికి ఊపిరి సలపనీయడం లేదు. కానీ, రాజకీయంగా నిలబడాలంటే మాత్రం ఈ సంక్షేమ పథకాలు అమలు చేయక తప్పని పరిస్థితి.

అగ్నిపరీక్షగా మార్చి బడ్జెట్ సెషన్

మూసీ పునరుద్ధరణ, ఫ్యూచర్ సిటీ వంటి భారీ ప్రాజెక్టుల కంటే, పేదల చేతికి వచ్చే పింఛను, మహిళలకు వచ్చే నగదు సహాయమే ఎన్నికల్లో ఓట్లు కురిపిస్తాయని రేవంత్ రెడ్డి గుర్తించాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రాధాన్యతలను మార్చుకోకపోతే, అభివృద్ధి ప్రాజెక్టుల మధ్య సంక్షేమం నలిగిపోయే ప్రమాదం ఉంది. మార్చి 16 నుంచి ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో రేవంత్ సర్కార్ ఇచ్చే స్పష్టత తెలంగాణ రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కేవలం వాగ్దానాలతో కాలం గడిపే దశ దాటిపోయింది. పింఛన్ల పెంపునకు అవసరమైన అదనపు నిధులు, మహాలక్ష్మి పథకానికి అయ్యే వేల కోట్ల రూపాయలను ఎలా సమీకరిస్తారనే దానిపైనే ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వసనీయత ఆధారపడి ఉంటుంది. ఈ పరీక్షలో నెగ్గితే రేవంత్ తిరుగులేని నేతగా ఎదుగుతారు, లేదంటే ప్రజా వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుందన్న అభిప్రాయం వినిపిస్తోంది..

# భారత్ సొంతమైన ఇజ్రాయెల్ 'ఐరన్ డోమ్'

మిస్సైల్ డిఫెన్స్ టెక్నాలజీని భారత్తో పంచుకోవడానికి అంగీకరించింది. ముంబైలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ యానివ్ రేవచ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా భారత్లోనే సైనిక హార్డ్వేర్ను తయారు చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధంగా ఉంది.

# బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టిస్తాం: కేటీఆర్

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ... శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్లు 4000 మంది పోలీసుల పహారాలో పేదల ఇళ్లను కూల్చివేయడం ఇందిరమ్మ రాజ్యమా? అని నిలదీశారు. బాధితులకు అండగా ఉంటామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఇదే స్థలంలో ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదని ఆయన భరోసా ఇచ్చారు. ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులే ఈ అక్రమాలకు సూత్రధారులని కేటీఆర్ ఆరోపించారు. సుమారు 60 ఎకరాల విలువైన భూదాన్ భూములపై మంత్రుల కన్ను పడిందని, వారి అక్రమ సంపాదన కోసమే పేదలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలాంటి తప్పు చేయకపోతే ముగ్గురు మంత్రులు నేరుగా ఇక్కడికి వచ్చి బాధితులకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఏ తప్పు జరగనప్పుడు ఆర్డీవోను ఎందుకు బదిలీ చేశారని ప్రశ్నించిన ఆయన, ఒక అధికారిని బలిపశువు చేసి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తోందని విమర్శించారు. పేదల ఉసురు తగిలి తీరుతుందని, అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న మంత్రుల వైఖరిని అసెంబ్లీలోనూ, కౌన్సిల్‌లోనూ ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు. పట్టాలు సక్రమంగా ఉన్నా, కేవలం కాంగ్రెస్ నేతల వంకర బుద్ధితోనే ఈ దాడులు జరిగాయని ధ్వజమెత్తారు. "ఒకప్పుడు దేశంలో ఒరిజినల్ గాంధీలు ఉండేవారు, ఇప్పుడు డూప్లికేట్ గాంధీలు తయారయ్యారు" అంటూ ఎద్దేవా చేశారు. పేదల ఇళ్లు కూల్చిన పాపం మంత్రులను విడిచిపెట్టదని అన్నారు.



# జర్నలిస్టులపై అక్రమ అరెస్టులు నిలిపివేయాలి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి

**మన దునియా, విశాఖ ఉమ్మడి జిల్లా బ్యూరో ఫిబ్రవరి 26**

విశాఖ: ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్థంభంగా నిలుస్తుంది. జర్నలిస్టులు సమాజానికి కళ్ళు, చెవులు, స్వరంగా పనిచేస్తూ అధికారుల తప్పులను, అవినీతిని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తారు. అయితే ఇటీవలి కాలంలో జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తిస్తున్న సమయంలో వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం, బెదిరింపులకు పాల్పడడం, అక్రమ అరెస్టులు చేయడం వంటి ఘటనలు ఆందోళనకరంగా మారాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) ప్రకారం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ప్రతి పౌరుడికి హామీ ఇవ్వబడింది. పత్రికా స్వేచ్ఛ కూడా అదే హక్కులో భాగం. అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించినందుకు జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఒక జర్నలిస్ట్ మౌనం పాటిస్తే ప్రజల సమస్యలు వెలుగులోకి రావు. అవినీతి పెరుగుతుంది. ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయి. జర్నలిస్టులు అనేక సందర్భాల్లో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారు. వారిని రక్షించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం బాధ్యత కూడా అని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు:

జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే రద్దు చేయాలి

అక్రమ అరెస్టులను నిలిపివేయాలి

జర్నలిస్టులకు భద్రత కల్పించాలి

పోలీసు అధికారుల దుర్వినియోగంపై స్వతంత్ర విచారణ జరపాలి

పత్రికా స్వేచ్ఛకు పూర్తి రక్షణ కల్పించాలి

శాంతియుత నిరసన పిలుపు:

పత్రికా స్వేచ్ఛ రక్షణ కోసం అన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టులు, ప్రజలు ఐక్యంగా శాంతియుతంగా ఒక రోజు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేయాలని క్విక్ టుడే న్యూస్ రిపోర్టర్ షేక్ ఇస్మాయిల్ పిలుపునిచ్చారు.

"కలం ఆగితే నిజం ఆగుతుంది

నిజం ఆగితే ప్రజాస్వామ్యం నిలవదు.""

# వయనాడ్‌లో 100 ఇళ్లు... శంకుస్థాపన వేళ సరదా అంశం పంచుకున్న రాహుల్ గాంధీ

కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన కారణంగా సర్వం కోల్పోయిన కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కలిసి బాధితుల కోసం నిర్మించనున్న 100 ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. చురల్మల-ముండక్కాయ్ విపత్తు బాధితులకు ఈ ఇళ్లను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఈ విపత్తు వయనాడ్ ప్రజల ధైర్యాన్ని, మానవత్వాన్ని ప్రపంచానికి చూపిందన్నారు. "మీరు చాలా కోల్పోయారు, కానీ మీ ధైర్యాన్ని, మానవత్వాన్ని కోల్పోలేదు" అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన తన సోదరి ప్రియాంకతో ప్రయాణంలో జరిగిన ఓ సరదా సంఘటనను పంచుకున్నారు. "నేను మా సోదరితో సరదాగా ఏదో అన్నాను. అప్పటి నుంచి ఆమె నాతో మాట్లాడటం లేదు. ఇక్కడికి ఫ్లైట్‌లో వచ్చేంత వరకు ముభావంగానే ఉంది. కానీ వయనాడ్‌లో అడుగుపెట్టగానే ఆమె మారిపోయింది. మాకు వయనాడ్ అంటే అదే!" అని చెప్పడంతో సభలో నవ్వులు పూశాయి. ఈ ప్రాంతంతో తమకు రాజకీయాలకు అతీతమైన బంధం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... జూలై 30న విపత్తు జరిగిన వెంటనే తాను ఈ ప్రాంతానికి వచ్చినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు నేను చూసిన దృశ్యాలు నా జీవితంలో మర్చిపోలేను" అని అన్నారు. ఇళ్లు, జీవనోపాధి, వ్యాపారాలు కోల్పోయిన కుటుంబాల పరిస్థితి తనను కలచివేసిందని చెప్పారు. అప్పటికి, ఇప్పటికి తాను మీ కుటుంబంలో ఒకరిగా మారిపోయానని భావోద్వేగంగా అన్నారు. ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించామని, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరామని ప్రియాంక తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి నిలిచారని ప్రశంసించారు. ఈ ప్రాజెక్టు కింద ప్రతి కుటుంబానికి 8 సెంట్ల స్థలంలో 1,100 చదరపు అడుగుల ఇల్లు నిర్మించి ఇవ్వనున్నారు. అలాగే, నష్టపోయిన 40 మంది దుకాణదారులు తమ వ్యాపారాలను తిరిగి ప్రారంభించుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు.



# మరో ఎన్ కౌంటర్.. భద్రతాబలగాల కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

## ఆపరేషన్ కగార్ పేరుతో మావోలపై విరుచుకుపడుతున్న బలగాలు

## ఛత్తీస్ గఢ్ ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్

## మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాల స్వాధీనం

మావోయిస్టులపై ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ ఆపరేషన్ లో వందలాది మంది మావోలు మృతి చెందారు. వీరిలో అత్యంత కీలకమైన మావో లీడర్లు కూడా ఉన్నారు. ఇప్పటికే అనేక మంది మావోలు లొంగిపోయారు. పలువురు మావోలు లొంగిపోవడానికి సిద్దంగా ఉన్నారు. మరోవైపు, మావోలపై భద్రతాబలగాలు విరుచుకుపడుతూనే ఉన్నాయి. తాజాగా, ఛత్తీస్ గఢ్ బీజాపూర్ జిల్లా ఇంద్రావతి ప్రాంతంలో మరో ఎన్ కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోలు హతమయ్యారు. ఘటనా స్థలి నుంచి మృతదేహాలతో పాటు, భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ... జంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రావతి నది ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. పారిపోయిన మావోల కోసం కూంబింగ్ జరుగుతోందని వెల్లడించారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# బిఆర్టీసీ ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

**రోడ్డెక్కనున్న మహిళా సంఘాల బస్సులు, ఇక టెన్షన్ ఫ్రీ జర్నీబి**

**మన దునియా,హైదరాబాద్: ఫిబ్రవరి 26**




తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది. రాష్ట్రంలోని కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా వారి కోసం ప్రత్యేకంగా పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్, ఆహార పరిశ్రమలు ఏర్పాటు చేయించింది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద పొదుపు సంఘాల డబ్బులతో టీజీఎస్ఆర్టీసీ భారీగా బస్సులను సమకూర్చుకుంటోంది. గతేడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.ప్రస్తుతం 152 బస్సులను మహిళా సంఘాల సమాఖ్యలు ఆర్టీసీకి అద్దెకిచ్చారు. ఆయా బస్సులకు డ్రైవర్లు, కండక్టర్లను ఆర్టీసీనే సమకూర్చింది. ఒక్కో బస్సుకు ఆర్టీసీ నెలకు రూ.69,468 చొప్పున అద్దె చెల్లిస్తోంది. తాజాగా మరో కొన్ని బస్సులు రోడ్డెక్కేందుకు సిద్ధమయ్యాయి. 200 బస్సులకు బాడీ బిల్డింగ్ పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. మరో 248 బస్సులు వచ్చే (మార్చి) నెలాఖరునాటికి సిద్ధం అవుతాయని చెబుతున్నారు. ఇప్పటికే తిరుగుతున్న బస్సులకు తోడు.. సిద్ధంగా ఉన్న 200 బస్సుల్ని వీలైనంత తొందరగా ప్రారంభించాలని ఆర్టీసీ భావిస్తోంది. సర్కార్ నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఈ బస్సులను రోడ్డెక్కించే ఛాన్స్ ఉంది. గతేడాది ప్రవేశపెట్టిన 152 బస్సులకు పైలట్ ప్రాజెక్టు కింద మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్ జిల్లాలను ఎంపిక చేశారు. మహిళా సంఘాల నుంచి రుణాలు తీసుకున్న నేపథ్యంలో ఈ బస్సుల్ని ఆయా సంఘాలకు ఆర్టీసీ హైపోథికేషన్ చేయించింది.బిగతంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి బస్సులను అద్దెకు తీసుకొని ఆర్టీసీ సంస్థ నిర్వహించేది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు మహాలక్ష్మి పథకం అమలు చేశారు. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. జిల్లా బస్సుల్లో అయితే కాలు పెట్టేందుకు కూడా జాగా ఉండటం లేదు. దీంతో ఆర్టీసీకి అదనపు బస్సుల అవసరం ఏర్పడింది. మహిళా సంఘాల ద్వారా బస్సులు సమకూరడంతో ఆర్టీసీపై ప్రస్తుతం ఒత్తిడి తగ్గింది. ప్రయాణికులు కూడా టెన్షన్ ఫ్రీ జర్నీ చేస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఆర్టీసీకి 600 బస్సులు అద్దెకు ఇవ్వాలనేది టార్గెట్‌గా పెట్టుకున్నారు. తొలివిడతలో 152 బస్సులు మంజూరు చేయగా.. మిగతా 448 బస్సులు కూడా ఇవ్వాలని సెర్ప్ నిర్ణయించింది. తాజాగా 200 బస్సులు అందుబాటులోకి వస్తుండగా. మిగిలిన బస్సులు సైతం రోడ్డెక్కనున్నాయి..

# రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద పెరుగుతున్న "డాక్యుమెంట్ రైటర్లు"?

**కాపీపేస్ట్ పొరపాట్లతో లక్షలు నష్టపోతున్న ప్రజలు..!**

**మన దునియా,వరంగల్:ఫిబ్రవరి 26**




నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్ల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నప్పటికీ, వారి పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. "ఎవడు పడితే వాడు డాక్యుమెంట్ రైటర్ అవతారం ఎత్తుతున్నాడు" అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అనుభవం, న్యాయపరమైన అవగాహన లేకుండానే కేవలం కాపీపేస్ట్ విధానంలో పత్రాలు తయారు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది జూనియర్ న్యాయవాదులు కూడా సీనియర్ న్యాయవాదులకు తెలియకుండా డాక్యుమెంట్ రైటర్లుగా వ్యవహరిస్తున్నారని సమాచారం. అయితే పత్రాలు సక్రమంగా సిద్ధం చేస్తున్నారా అంటే అనుమానాలే ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి.ఇటీవల ఓ అపార్ట్మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని మరుసటి రోజు గృహప్రవేశం నిర్వహించుకోవాలని భావించిన కుటుంబానికి భారీ షాక్ తగిలింది. డాక్యుమెంట్‌లో తీవ్రమైన తప్పిదం ఉండటంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పటికే రూ.3 లక్షల చలానా చెల్లించిన తర్వాత లోపం బయటపడటంతో కార్యాలయ సిబ్బంది సైతం ఆశ్చర్యానికి గురయ్యారు.చలానా డబ్బులు వృథా కావడంతో పాటు గృహప్రవేశం కూడా వాయిదా పడింది. "ఏమైంది సారు?" అని ప్రశ్నిస్తే "రేపు మాపు చూస్తాం" అంటూ ఫోన్ ద్వారా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. "ఎవరు చేసే పని వాళ్లే చేయాలి. చేయడానికి ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి" అని పలువురు అభిప్రాయపడుతున్నారు. సగం సగం తెలిసిన పరిజ్ఞానంతో కీలకమైన రిజిస్ట్రేషన్ పత్రాలు సిద్ధం చేయడం ప్రజలకు ప్రమాదకరమని న్యాయవర్గాలు సూచిస్తున్నాయి. సోషల్ మీడియాలో చురుకుగా మాట్లాడటం ఒకే కావొచ్చు కానీ, చట్టపరమైన పత్రాలు తయారు చేయడం అంత ఈజీ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లపై పర్యవేక్షణ కఠినతరం చేయాలని, అనుభవం ఉన్నవారికే అనుమతి ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇలాంటి తప్పిదాలు కొనసాగి మరింత మంది ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్యభట్ట స్కూల్లో దారుణం.. విద్యార్థికి ఉరి వేసి చంపే ప్రయత్నం

**మన దునియా, మహబూబాబాద్,తొర్రూర్: ఫిబ్రవరి 26**

మహబూబాబాద్ :::తొర్రూర్ ప్రైవేట్ స్కూల్ నెల్లికుదురు వెళ్లే దారిలో ఉన్న ఆర్యభట్ట స్కూల్లో దారుణ సంఘటనలు జరుగుతున్న పాఠశాలపై చర్యలు తీసుకోలేని అధికారులు. లోగోడ రెండు మూడుసార్లు బస్సు డ్రైవర్ తాగిన మత్తులో విద్యార్థులు తో వెళ్లే బస్సు బోల్తాపడ్డ స్కూల్ పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రెండు రోజుల క్రితం టీకేఆర్ తండా చిన్న వంగర పెద్ద వంగర తండా ప్రజలు తమ పిల్లలను ఉన్నత చదువులకు ఉన్నత విద్య కోసం 50 వేల నుండి 60 వేల వరకు ఫీజులు చెల్లించి చదివిస్తున్న వారి పిల్లలకు భరోసా ఇవ్వలేని ఆర్యభట్ట స్కూల్ యాజమాన్యం. చిన్నపిల్లవాడిని రాత్రి పూట తువ్వాలతో నోట్లో కుక్కి స్లాబ్ కు ఉన్న కుక్క ఆయనకి వేలాడదీసి చంపే ప్రయత్నం చేశారూ. ఆ పిల్లవాని అదృష్టం బాగుంది వేరే వాళ్ళు చూసి అతని కాపాడాలని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పి ఆర్యభట్ట స్కూల్ యాజమాన్యాన్ని సంప్రదించగా. పొంతన లేని సమాధానం చెబుతూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గురువారం పిల్లల తల్లిదండ్రులు ధర్నా చేయడంతో విలేకరులు విషయం తెలుసుకొని వెళ్లగా తల్లిదండ్రులు కొత్తగా కట్టే స్కూలుకు తమ పిల్లవాణ్ణి బలి ఇవ్వాలని ఆలోచనతో నోట్లో గుడ్డలు కుక్కి చంపే ప్రయత్నం చేశారని, అన్నారు. పోలీసు వారు వచ్చి పిటీషన్ ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని అనడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్కు వెళ్ళినారు. డబ్బులతో దండుకొని పాఠశాలను నడిపేవారు పిల్లలకు సౌకర్యాలు కల్పించడంతో విఫలమైన పాఠశాలలపై ఇకనైనా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు అన్నారు. ఆర్యభట్ట స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరే ప్రయత్నంలో వారు అందుబాటులోకి రాకపోవడంతో వెని తిరిగి వెళ్లిపోవడం జరిగినది. ఇట్టి విషయంపై పోలీసులు లోతైన దర్యాప్తు చేసి తల్లిదండ్రులకు పిల్లలకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరినారు.



## నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాస్టర్ ఏసుబాబు రక్తహీనతతో బాధపడుతున్న మహిళకు రక్తదానం చేశారు

**మన మంగపేట (మన దునియా న్యూస్) పిబ్రవరి 26**



మంగపేట మండలం చీపురు దుబ్బ గ్రామానికి చెందిన బిజ్జ. యశోద అనే మహిళ అనారోగ్యంతో భద్రాచలం ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా వారికి రక్తహీనత ఉంది వైద్యులు రక్తం ఎక్కించాలంటే ఆ విషయాన్ని వాట్సఅప్ ద్వారా తెలుసుకున్న అమీర్ నేస్తం సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాస్టర్ ఏసుబాబుచే రక్తదానం అందించారు, రక్తదాత ఏసుబాబు సహకారానికి , నేస్తం సేవ ట్రస్ట్ సహాయానికి యశోద కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

విజయ్‌కు దగ్గరగా కాంగ్రెస్ స్టాలిన్‌ను బెదిరించడానికే!

మన దునియా,తమిళనాడు: ఫిబ్రవరి 26

తమిళనాడు రాజకీయాల్లో 2026 అసెంబ్లీ ఎన్నికల వేడి అప్పుడే మొదలైంది. ముఖ్యంగా డీఎంకే నేతృత్వంలోని కూటమిలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీని ఒక తురుపు ముక్కగా చూపిస్తూ, డీఎంకేపై ఒత్తిడి పెంచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.

టీవీకే సాకుతో కాంగ్రెస్ బేరసారాలు

తమిళనాడులో దశాబ్దాలుగా డీఎంకే వెంటే నడుస్తున్న కాంగ్రెస్‌కు ఈ సారి పట్టు పెంచుకోవాలన్న కసి కనిపిస్తోంది. గత ఎన్నికల్లో కేటాయించిన 25 సీట్ల కంటే ఎక్కువ సుమారు 35–45 సీట్లు కావాలని, అలాగే ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఈ డిమాండ్లను డీఎంకే తిరస్కరిస్తే.. తమకు విజయ్ రూపంలో మరో ప్రత్యామ్నాయం ఉందనే సంకేతాలను కాంగ్రెస్ నేతలు చాకచక్యంగా పంపుతున్నారు. టీవీకే తలుపులు తెరిచి ఉన్నాయన్న ప్రచారాన్ని డీఎంకేను బ్లాక్ మెయిల్ చేయడానికి ఒక అస్త్రంగా వాడుకుంటున్నట్లు కనిపిస్తోంది.

విజయ్ ఇమేజ్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్

నటుడు విజయ్ స్థాపించిన టీవీకేకు యువతలో విపరీతమైన క్రేజ్ ఉంది. దాదాపు 15–20 శాతం ఓటు బ్యాంకును ఆ పార్టీ ప్రభావితం చేయగలదని అంచనా. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీని నడిపించే బలమైన రాజకీయ ముఖాలు ఆ పార్టీలో తక్కువ. ఒకవేళ కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీ జతకడితే, అది టీవీకేకు రాజకీయంగా పెద్ద ప్లస్ అవుతుంది. అటు కాంగ్రెస్‌కు కూడా డీఎంకే నీడ నుంచి బయటపడి తన స్వంత బలాన్ని పరీక్షించుకోవడానికి ఇది ఒక అవకాశంగా మారుతుంది. కానీ, ప్రస్తుతానికి ఇది కేవలం వ్యూహాత్మక ఎత్తుగడగానే కనిపిస్తోంది.

కాంగ్రెస్‌కు జాతీయ అవసరాలు

కాంగ్రెస్ ఎన్ని డిమాండ్లు పెట్టినా, అంతిమంగా జాతీయ స్థాయిలో ఇండియా కూటమి బలోపేతం కావాలంటే డీఎంకే మద్దతు అత్యవసరం. రాహుల్ గాంధీ, స్టాలిన్ మధ్య ఉన్న సాన్నిహిత్యం దృష్ట్యా.. కాంగ్రెస్ హైకమాండ్ చివరకు డీఎంకే చెప్పినన్ని సీట్లకే సర్దుకుపోయే అవకాశం ఉంది. బీజేపీని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న వేళ, తమిళనాడులో బలమైన డీఎంకేను వదిలి, ఇంకా పరీక్షకు నిలబడని టీవీకేతో వెళ్లడం కాంగ్రెస్‌కు కత్తిమీద సామే అవుతుంది. విజయ్ పార్టీకి ఈ సమీకరణాల వల్ల పోయేదేమీ లేదు. తొలి ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా తన అసలు బలం ఎంతో తెలుస్తుంది. ఒకవేళ కాంగ్రెస్ ఈసారి రాకపోయినా, భవిష్యత్తులో ఖచ్చితంగా తన వైపు వస్తుందని విజయ్ భావిస్తున్నారు. అందుకే కూటమి కోసం అర్రులు చాచకుండా, డీఎంకే–కాంగ్రెస్ మధ్య జరుగుతున్న ఈ సీట్ల సమరం ను టీవీకే నిశ్శబ్దంగా గమనిస్తోంది.

## బాధితులను బెదిరించిన సీఐపై చర్యలు తీసుకోవాలి:- ప్రజా సంఘాలు

**మన దునియా హనుమకొండ:ఫిబ్రవరి 26**




బాధితులను బెదిరిస్తున్న సుబేదారి సీఐ రంజిత్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. న్యాయం కోరుతూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వారిని పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించడం దుర్వినియోగమని వారు ఆరోపించారు. హైకోర్టు న్యాయవాది కలకోట మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంగీ ఏలేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ సంయుక్తంగా మాట్లాడారు.వారి వివరాల ప్రకారం, కాజీపేట మండలం హంటర్ రోడ్ శాయంపేటలోని సర్వే నెంబర్ 306/బి లో ఆదేపు రాజేష్ కుటుంబానికి చెందిన 564 గజాల భూమి అన్ని రకాల చట్టబద్ధ పత్రాలతో ఉన్నప్పటికీ, రిటైర్డ్ ఆర్డీవో సురేందర్ రెడ్డి ఆ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు.ఈ విషయమై సుబేదారి సీఐ రంజిత్ కుమార్‌ను కలవడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, "మీకు ఈ భూమితో ఏం సంబంధం" అంటూ అమర్యాదగా ప్రవర్తించడమే కాకుండా, అక్కడి నుండి వెళ్లిపోవాలని హెచ్చరించాడని తెలిపారు. మరోసారి భూమి తమదని చెబితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని బాధితులను బెదిరించాడని పేర్కొన్నారు.ఈ ఘటనపై గురువారం బాధితుడు ఆదేపు రాజేష్ ప్రజాసంఘాల నాయకులతో కలిసి పోలీస్ కమిషనర్‌ను ఆధారాలతో కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సీఐపై శాఖాపరమైన మరియు చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో దళిత, బీసీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# హనుమకొండ కోర్టుకు బాంబు బెదిరింపులు.. కలకలం



**మన దునియా,సుబేదారి:ఫిబ్రవరి 26**

హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని కోర్టుకు బాంబు బెదిరింపులు రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో కూడా పలుమార్లు ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. ఈ రోజు కూడా వచ్చిన సమాచారం మేరకు అప్రమత్తమైన పోలీసులు వెంటనే కోర్టు భవనంలో ఉన్న న్యాయవాదులు, సిబ్బంది, ప్రజలను బయటకు పంపించారు.సుబేదారి పోలీసులు కోర్టుకు చేరుకుని భద్రతా చర్యలు చేపట్టారు. బాంబు స్క్వాడ్ సిబ్బంది ప్రత్యేక పరికరాలతో కోర్టు ప్రాంగణాన్ని తనిఖీ చేస్తున్నారు.ఏదైనా అనుమానాస్పద వస్తువు ఉందా అనే దానిపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బెదిరింపుల వెనుక ఉన్న వ్యక్తులపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో కోర్టు పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీలో విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో కీలక అంశాలు

**మన దునియా,బాసర:ఫిబ్రవరి 26**



యువతి పెళ్లికి నిరాకరించిందని ప్రియుడి ఆత్మహత్య, మనస్తాపంతో మరుసటి రోజు యువతి ఆత్మహత్య బాసర ట్రిపుల్ ఐటీ కాలేజీలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న వనపర్తి జిల్లా పానగల్ మండలం అన్నారంతండాకు చెందిన చిట్టెమ్మ, లోక్యానాయక్ దంపతుల రెండో కూతురు వసంత(19) అనే విద్యార్థిని వసంతను గత కొంతకాలంగా ప్రేమిస్తూ, పెళ్లి చేసుకోవాలని కోరిన ఆమె మేనత్త కొడుకు గణేష్ నాయక్చదువు పూర్తయ్యేంత వరకు పెళ్లి చేసుకోనని వసంత చెప్పడంతో, ఉరివేసుకుని గణేష్ నాయక్ ఆత్మహత్యఈ విషయం తెలుసుకుని భయంతో మెడపై గాట్లు పెట్టుకుని, ఉరివేసుకుని వసంత ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు వెల్లడి వసంత చివరి ఫోన్ కాల్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

# నేటి నుంచి మిర్చి రైతులకు యార్డులో భోజనం


**మన దునియా,గుంటూరు: ఫిబ్రవరి 26**



మిర్చి యార్డులో అన్నదాతలకు గురువారం నుంచి ఉచిత భోజన పథకం అమల్లోకి రానుంది.టెండర్ల ఖరారులో జాప్యం వల్ల ఈ ఏడాది పథకం ఆలస్యమైంది. పాలకవర్గం, అధికారులు టెండరు ఖరారు చేసి గుత్తేదారుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. భోజనం, అల్పాహారం రూ. 88. 25కే పెట్టేలా ఒప్పించారు. ఇందులో ఆల్పాహారానికి రూ. 20, భోజనానికి రూ. 68. 25. గురువారం ఉదయం 11. 30 గంటలకు యార్డు చైర్మన్ కుర్రా అప్పా రావు, కార్యదర్శి చంద్రిక పథకాన్ని ప్రారంభిస్తారు. డైనింగ్ హాలును శుభ్రం చేయించారు. వంట సామగ్రి, ఫ్రిజ్లు సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి అల్పాహారం కూడా పెడతారు....

# ఐపీఎస్ సునీల్ నాయక్‌కు అరెస్ట్ వారెంట్ జారీ

**మన దునియా,ఆంధ్రప్రదేశ్: ఫిబ్రవరి 26**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసు ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో సీఐడీ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన సునీల్ నాయక్, ఆర్ఆర్ఆర్ అరెస్టు సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని, శారీరక హింసకు పాల్పడ్డారనే ఆరోపణలపై విచారణ ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం బిహార్ రాష్ట్రంలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న సునీల్ నాయక్‌ను అదుపులోకి తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అరెస్టు చేసినా సాంకేతిక కారణాలతో పట్నా కోర్టు ట్రాన్సిట్ వారెంట్ జారీకి నిరాకరించడంతో పోలీసులు అరెస్టు వారెంట్ కోసం ప్రయత్నించారు. ఇప్పుడు వారెంట్ రావడంతో ఆయనను అదుపులోకి తీసుకోనున్నారు. అయితే ఆయన ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లినట్లుగా ప్రచారం జరుగుతోంది.

# సర్పంచులను అవమానించిన డిపిఓ జగదీశ్వర్, డిఎల్పిఓ శ్రీనివాస్ లను సస్పెండ్ చేయాలి





- అధికారుల పై చట్టపరమైన చర్యలు గూర్చి మంత్రి సీతక్క, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద గారికి ఫిర్యాదులు చేస్తాం
- డిపిఓ జగదీశ్వర్, డిఎల్పిఓ శ్రీనివాస్ లు మా ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ, సర్పంచులకు వెంటనే క్షమాపణ చెప్పాలి
- టి పి సి సి డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జి తిప్పారావు సంపత్

**మన దునియా హుజురాబాద్, సింగపూర్:ఫిబ్రవరి 26**

హుజురాబాద్ మండలం సింగపూర్ కిడ్స్ కాలేజీలో గత రెండు రోజులుగా.సైదాపూర్, వీణవంక మండలాల 53 మంది నూతన సర్పంచులకు నిర్వహిస్తున్న జనరల్ ఓరియంటేషన్ శిక్షణలో అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కించపరిచేలా ఉందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ అట్రాసిటీ స్టేట్ ఇంచార్జ్ తిప్పారపు సంపత్ తీవ్రంగా మండిపడ్డారు. ఈరోజు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. శిక్షణ పేరుతో మా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, మహిళా సర్పంచులను అవమానపరిచే విధంగా ఒక నేరస్తులుగా, ఒక స్కూలు పిల్లలుగా, నిలిచోబెట్టిన డిపిఓ జగదీశ్వర్, డి ఎల్ పి ఓ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి సైదాపూర్, ఎంపీడీవో రాజేశ్వరరావు ఇల్లంతకుంట, ఎంపీఓ సురేందర్ వీణవంక, గ్రామ సెక్రటరీ రేవంత్ రెడ్డి, స్వచ్ఛభారత్ రమేష్ లు కుర్చీలపై కూర్చొని సర్పంచ్ లను నిలబెట్టడం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని మా సర్పంచులను నిలబెట్టి, తాము మాత్రం కుర్చీల్లో కూర్చొని ఫోటోలకు ఫోజులిస్తూ అహంకారాన్ని ప్రదర్శించారని ఆరోపించారు. పోలీసులు నేరస్తులను మీడియా ముందు ఎలాగైతే నిలబెట్టి ఫోటోలు తీస్తారో, అదే విధంగా నూతన సర్పంచులను నిలబెట్టి ఫోటోలు దిగడం వారిని అవమానించడమేనని తిప్పారపు సంపత్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులను అవమానపరిచిన సదరు అధికారులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులకు కనీస గౌరవం ఇవ్వని అధికారులు శిక్షణ ఇవ్వడానికి అనర్హులు. అధికారుల నియంతృత్వ ధోరణిని సహించేది లేదు ఇలాంటి ఘటనలు మా ప్రభుత్వానికి మచ్చ తెచ్చే విధంగా ఉన్నాయని తిప్పారపు సంపత్ హెచ్చరించారు మా సర్పంచ్ లను అవమానించిన ఈ అధికారుల పై రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గారికి, మా మహిళ సర్పంచులను అవమానించినందుకు మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద గారికి ఫిర్యాదు చేస్తాము, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, వివిధ పార్టీల సర్పంచులను అవమానించిన ఘటనను జిల్లా కలెక్టర్ సీరియస్ గా తీసుకొని వారి పై సస్పెన్షన్ వేటు వేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాము ఈ సమావేశంలో టిపిసిసి లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ జీడీ రవితేజ, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ చిట్యాల రేవంత్, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రేణిగుంట్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు

# సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య





**మన దునియా,బాలసముద్రం: ఫిబ్రవరి 26**



బాలసముద్రం, ఏకశిలాపార్కు సమీపంలోని శ్రీ సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ద్విపుష్కర ప్రయుక్త పట్టాభిషేకోత్సవాత్మక పంచాహ్నిక పుష్కర బ్రహ్మోత్సవాలకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన పుష్పయాగ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, ఆధ్యాత్మికతతో సమాజంలో శాంతి, ఐక్యత, సద్భావన పెరుగుతాయన్నారు. శ్రీ సీతారామచంద్ర ప్రసన్నాంజనేయస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఇటువంటి సంప్రదాయ ఉత్సవాలను తరతరాలకు నిలుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవి, ఆలయ కమిటీ చైర్మన్ దేవేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు స్వాతి, ఉమా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

# ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించే కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**జనగామ జిల్లా అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించిన కలెక్టర్.**

**ఈ నెల 27 న జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్న రిజ్వాన్ బాషా షేక్.**




**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా:ఫిబ్రవరి 26**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడంలో ముందుండటమే కాక ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తారని పేరుగాంచిన అధికారి రిజ్వాన్ బాషా షేక్. జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్ రెండేళ్లు పూర్తి చేసుకుని జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈనెల 27న జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించనున్న రిజ్వాన్ బాషా షేక్ తన విధి నిర్వహణలో అంకితభావం కలిగిన అధికారిగా పేరుగాంచారు.అక్షరాస్యతలో జోగులాంబ గద్వాల జిల్లా వెనకబడి ఉండడంతో కొత్తగా బాధ్యతలు స్వీకరించనున్న కలెక్టర్ ఈ ప్రాంతంలో విద్యా రంగాన్ని పరుగులు పెట్టించడమే కాక అన్ని రంగాల్లో గద్వాల జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తారనడంలో అతిశయోక్తి లేదు. జనగామ జిల్లా కలెక్టర్ గా సంక్షేమ పథకాల అమలులో చేసిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు ఆయన ప్రతిభకు తార్కాణాలుగా చెప్పవచ్చు. కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనగామ జిల్లాలో సాధించిన ప్రగతి, అందుకున్న పురస్కారాలు ఆయన నిబద్ధతకు కొలమానాలుగా చెప్పవచ్చు.కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జనగామ జిల్లాలో "మన జిల్లా - మన నీరు" అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టి విజయవంతమయ్యారు. ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న దిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ చేతుల మీదుగా జల్ సంచాయ్ - జన్ భాగీధారీ 1.0 అవార్డు, అలాగే జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సైతం అందుకున్నారు.అలాగే జనగామ జిల్లాలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినందుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అందుకున్నారు.అలాగే ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బందికి నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా పురస్కారాన్ని కూడా కలెక్టర్ పొందడం జరిగింది.దేశవ్యాప్తంగా జాతీయస్థాయిలో నిర్వహించిన చీూూ (నేషనల్ అచీవ్మెంట్ సర్వే) - 2024 సర్వేలో జనగామ జిల్లా విద్యార్థులు తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సాధించడంలో విశేష కృషి చేసినందున 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అవార్డును అందుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జనగామ జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు తరచు ఆయా ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటనలు చేసేవారు, వివిధ శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహించేవారు. జనగాం జిల్లాను రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ అంశాల్లో ముందంజలో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీపై రావడం గర్వకారణంగా భావించవచ్చు. నీతి అయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంకు గట్టు మండలం ఎంపిక కావడంతో నిర్దేశించిన అంశాల్లో 100% లక్ష్యాలను సాధించేందుకు కొత్త కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెడతారని చెప్పవచ్చు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో ముందుండేలా ఇక్కడి ప్రజాప్రతినిధులను, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పారదర్శకమైన పాలనతో గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# తెలంగాణలో 45 మంది ఐఏఎస్‌ల బదిలీ

**మన దునియా,హైదరాబాద్:ఫిబ్రవరి 26**

హైదరాబాద్, ఫిబ్రవరి 26: తెలంగాణలో భారీ స్థాయిలో ఐఏఎస్‌లు బదిలీ అయ్యారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జాకు బాధ్యతలు అప్పగించారు. అలాగే, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

బి.విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం

అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ

సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ

సందీప్ కుమార్ ఝూ - జనగాం కలెక్టర్‌గా నియామకం

ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం

జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ

స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం

గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం

ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్

అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా నియామకం

చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా నియామకం

ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా నియామకం

పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా నియామకం

అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా బదిలీ

ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం..





## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్ఫరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్తంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్ఫరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం


## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?



ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణనలు.

## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?


పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుతుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్పరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి. ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %ఌ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.



# ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే చాలా స్పెషల్!..

- ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు 162 కిలోమీటర్ల నిర్మాణం
- తెలంగాణ, ఏపీని కలిపే యాక్సెస్ కంట్రోల్డ్ హైవే అన్ని చోట్లా లేటెస్ట్ టెక్నాలజీ వినియోగం
- ప్రతి 2 కిలోమీటర్లకు 360 డిగ్రీలు కవర్ చేసేలా కెమెరా సీసీ కెమెరాలు, స్ట్రీట్ లైట్లకు సోలార్ విద్యుత్ వినియోగం
- మేలో ప్రధాని మోదీతో ప్రారంభానికి ఏర్పాట్లు

**మన దునియా,ఖమ్మం:ఫిబ్రవరి 26**




ఖమ్మం: ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నాలుగు లేన్లలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే(ఎన్హెచ్ 365 బీజీ) ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుంది. లేటెస్ట్ టెక్నాలజీ వినియోగంతో పాటు మరెన్నో కొత్త అంశాలను ఈ హైవే పనుల్లో ఉపయోగిస్తున్నారు. ఎన్ హెచ్ 65, ఎన్హెచ్ 16ను కలుపుతూ రూ.4451.87 కోట్లతో 162 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మిస్తున్నారు. భారత్ మాల పరియోజన కింద హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ లో ఐదు ప్యాకేజీలుగా విభజించారు. తెలంగాణ పరిధిలో మూడు ప్యాకేజీలు (105.240 కిలోమీటర్లు), ఏపీలో రెండు ప్యాకేజీలు (56.890 కి.మీ.) ఉంది. 2022లో పనులు ప్రారంభం కాగా, వేర్వేరు కారణాలతో పనులు ఆలస్యమయ్యాయి. ఎట్టకేలకు మున్నేరు మీద బ్రిడ్జి పనులు చివరి దశకు చేరుకోగా, రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేసి, మే మొదటి వారంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు హైవే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**తగ్గనున్న దూరం, ప్రయాణ సమయం!**

ఇప్పటి వరకు హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్లేందుకు సూర్యాపేట, విజయవాడ మీదుగా 600 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కొత్త హైవే వల్ల హైదరాబాద్, సూర్యాపేట, ఖమ్మం మీదుగా వైజాగ్ వెళ్లేందుకు 56 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు 3 నుంచి 4 గంటల ప్రయాణ సమయం తగ్గనుంది. మొత్తం స్లోప్ కలుపుకొని 30 మీటర్ల వెడల్పుతో ఈ హైవే నిర్మాణం జరుగుతోంది. ఒక వైపు 9 మీటర్ల చొప్పున రోడ్లు, మధ్యలో నాలుగున్నర మీటర్ల మీడియన్ ఉంటాయి. 18 చోట్ల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో ప్రయాణించిన దూరాన్ని బట్టి ఎగ్జిట్ పాయింట్ దగ్గర టోల్ కట్ అవుతుంది. హైవేపైకి పశువులు రాకుండా యాక్సెస్ కంట్రోల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. ఎంట్రీ, ఎగ్జిట్ల దగ్గర వాహనాల డ్రైవర్లు, ప్రయాణికులు రెస్ట్ తీసుకునేందుకు 6 ట్రక్బేలు సిద్ధం చేస్తున్నారు. డొంకదారులు, అంతర్గత రహదారుల దగ్గర అండర్ పాస్ లు, సాగునీటి కాల్వల దగ్గర 10 మేజర్ బ్రిడ్జిలు, 49 మైనర్ బ్రిడ్జిలు నిర్మించారు. ఒక వైపు రెండు లేన్లకు గాను 80, 100 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ గా నిర్ణయించారు.

**విల్లు ఆకారంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి!**

ఖమ్మం నగరాన్ని ఆనుకొని వెళ్తున్న రైల్వే ట్రాక్ పై నుంచి ప్రస్తుతం బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీన్ని విల్లు ఆకారంలో నిర్మిస్తున్నారు. బౌ స్ట్రింగ్ గిర్డర్ బ్రిడ్జిగా దీన్ని వ్యవహరిస్తున్నారు. 52 మీటర్ల పొడవున నిర్మిస్తున్న ఈ బ్రిడ్జి 360 మెట్రిక్ టన్నుల బరువు ఉంటుంది. దీన్ని పూర్తిగా ఛత్తీస్గఢ్లోని భిలాయ్లో హైగ్రేడ్ స్టీల్ తో నాలుగు నెలల పాటు తయారుచేశారు. తర్వాత విడిభాగాలుగా తీసుకువచ్చి మళ్లీ ఇక్కడ వెల్డింగ్ చేస్తున్నారు.జాకీల సాయంతో క్రమంగా పైకి ఎత్తుతున్నారు. 11 మీటర్ల ఎత్తుండే ఈ బ్రిడ్జి నిర్మాణాన్ని కంప్లీట్ చేసేందుకు ఇంకా రెండు నెలలు పడుతుందని ఆఫీసర్లు చెబుతున్నారు. మార్చి నెలాఖరుకు ఒకవైపు నిర్మాణాన్ని కంప్లీట్ చేసి, రాకపోకలకు అనుమతి ఇస్తామంటున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తిగా రైల్వే అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. ప్రతి దశలో రైల్వే సేఫ్టీ టీమ్ తనిఖీలు చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే పనులు ముందుకెళ్తున్నాయి.

**రూల్స్ బ్రేక్ చేయకుండా సీసీ కెమెరాలతో చెక్!**

162 కిలోమీటర్ల ఈ జాతీయ రహదారిపై ప్రతి రెండు కిలోమీటర్లకు 360 డిగ్రీలు కవర్ చేసే ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ప్రతి కెమెరా ఒక కిలోమీటర్ దూరం వరకు వీడియోను రికార్డ్ చేస్తుంది. ఇన్సిడెంట్ డిటెక్షన్ సిస్టమ్తో ఈ కెమెరాలు 24 గంటలు పని చేస్తాయి. వాహనాలు ఓవర్ స్పీడ్ వెళ్లినా, బాగా నెమ్మదిగా వెళ్లినా, రాంగ్ రూట్ లో వెళ్లినా, సీటు బెల్ట్ పెట్టకపోయినా, హైవేపై వాహనం నిలిపి ఉంచినా ఆ వాహనాల ఫొటోలు తీస్తాయి. జూమ్ చేసినా వీడియో క్లారిటీ దెబ్బతినకుండా, వాహనాలు స్పీడ్ గా వెళ్తున్నా నెంబర్ ప్లేట్ కూడా రికార్డ్ అయ్యేలా హై రిజల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలతో పాటు హైవే మధ్యలో ఏర్పాటు చేస్తున్న లైట్లకు కూడా పూర్తిగా సోలార్ ప్యానల్స్ బిగించారు. బయటి నుంచి విద్యుత్ అవసరం లేకుండా, సోలార్తోనే నడిచేలా వాటికి రీచార్జబుల్ బ్యాటరీలను బిగించారు. వేరియేబుల్ మెసేజ్ సైన్(వీఎంఎస్) బోర్డులను అక్కడక్కడ ఏర్పాటు చేసి ట్రాఫిక్ జామ్, వెదర్, ట్రాఫిక్ డైవర్షన్ ఇన్ఫర్మేషన్, అలర్ట్ మెసేజ్లను ఈ సైన్ బోర్డుల్లో ప్రదర్శిస్తారు.

**అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సిస్టమ్!**

ఐదు ప్యాకేజీల్లోనూ అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్(ఏటీఎంఎస్) సెంటర్ ను ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో ఉండే సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి రియల్ టైమ్ ట్రాఫిక్ మూమెంట్ ను పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లపై మానిటర్ చేస్తారు. వాహనదారులు రూల్స్ బ్రేక్ చేస్తే సీసీ కెమెరాలు ఆటోమెటిక్గా రికార్డు చేసి, ఫొటోల రూపంలో ఏటీఎంఎస్ సెంటర్ కు పంపిస్తాయి. ప్రమాదం జరిగినా, వాహనం అనుకోకుండా ఆగిపోయినా ఈ సెంటర్ లోని ఎల్ఈడీ స్క్రీన్లపై అలర్ట్ చేసేందుకు పాప్ అప్ మెసేజ్ వస్తుంది. హైవే ప్రారంభం తర్వాత అన్ని కెమెరాలు అన్ని చోట్లా కనిపించేలా చూడడంతో పాటు రాష్ట్ర పోలీసులకు వీటిని అనుసంధానం చేయాలని నిర్ణయించారు. దీంతో నేరుగా ట్రాఫిక్ చలానా జనరేట్ అయ్యేలా ఉపయోగించను న్నారు. ఇక యాక్సిడెంట్లు లేదా ట్రాఫిక్ మళ్లింపు సమయంలో ఉపయోగపడేలా ప్రతి 5 కిలోమీటర్లకు ఎమర్జెన్సీ మీడియన్ ఓపెనింగ్ ను ఏర్పాటు చేశారు.

**రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేస్తాం..**

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మొట్టమొదటి యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే ఇదే. సంప్రదాయ హైవేల తరహాలో కాకుండా స్మార్ట్ టెక్నాలజీని ఉపయోగిస్తూ ఈ హైవే నిర్మిస్తున్నాం. రోడ్ సేఫ్టీని క్లోజ్గా మానిటర్ చేసేలా చర్యలు తీసుకున్నాం. సీసీ కెమెరాలు, ఏటీఎంఎస్లు ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ వాయిలేషన్స్ తగ్గుతాయి. రెండు నెలల్లో పనులన్నీ కంప్లీట్ చేసి, మే నెలలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నాం.

## అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం
ఫిబ్రవరి । శుక్రవారం । 27 । 2026


# జింబాబ్వేతో గెలుపే కాదు.. ఛేజింగ్, టార్గెట్ లెక్క ఇదీ - అప్పుడే సెమీస్ కు..!!



టీం ఇండియా సెమీస్ చేరుతుందా. చేరే అవకాశం ఉంది. అయితే, ఇందుకు చాలా లెక్కలు అధిగమించాలి. ఈ రోజు జింబాబ్వేతో జరిగే మ్యాచ్ లో గెలుపు మాత్రమే కాదు, అంతకు మించి అన్నట్లు ఆడాలి. గెలవాలి. రన్ రేటు సాధించాలి. అటు సౌతాఫ్రికా– వెస్టిండీస్ మ్యాచ్ సైతం టీమిండియా సెమీస్ అవకాశాల పైన ప్రభావం చూపనుంది. జింబాబ్వేతో భారత్ గెలుపుతో పాటుగా.. తొలుత బ్యాటింగ్ చేస్తే నిర్దేశించాల్సి లక్ష్యం.. జింబాబ్వేను ఎంతకు కట్టడి చేయాలి.. అదే విధంగా ఛేజింగ్ అయితే లక్ష్యం ఎన్ని ఓవర్లలో ఛేదించాలనేది టీమిండియా సెమీస్ లెక్కలకు కీలకంగా మారుతోంది.చెన్నైలో జింబాబ్వే తో టీమిండియా ఆడే మ్యాచ్ కీలకంగా మారనుంది. ఈ ప్రపంచ కప్ లీగ్ దశలో జింబాబ్వే టీం ఊహించని ఫలితాలు సాధించింది. ఇక.. వెస్టిండీస్ – జింబాబ్వే మధ్య జరిగిన సూపర్ –8 మ్యాచు లో వెస్టిండీస్ భారీ విజయం నమోద చేయటంతో టిమిండియా మరింత కష్టాల్లోకి వెళ్లింది. భారత్ సెమీస్ అవకాశాలను కరేబియన్ టీం వెనక్కు నెట్టేసింది. ఇప్పుడు గెలుపుతో పాటుగా నెన్ రన్ రేటు కీలకంగా మారుతోంది. ప్రస్తుతం మైనస్ లో ఉన్న టీమిండియా రన్ రేట్ ప్లస్ లోకి రావటం తో పాటుగా మిగిలిన మూడు టీంల లెక్కల కంటే మెరుగైన స్థాయిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అందులో భాగంగా జింబాబ్వేపై భారీ తేడాతో గెలవడం భారత్‌కు అత్యవసరం. జింబాబ్వేతో జరిగే మ్యాచులో భారత్ ముందుగా బౌలింగ్ చేస్తే, ప్రత్యర్థిని తక్కువ స్కోర్‌కే కట్టడి చేసి, లక్ష్యాన్ని చాలా వేగంగా చేధించాలి. టార్గెట్ చిన్నగా ఉంటే తక్కువ ఓవర్లలో చేధించడం సులభమవుతుంది. అయినప్పటికీ, బ్యాటింగ్‌లో దూకుడుగా ఆడాల్సిందే. ఇందు కోసం కావాల్సిన లెక్కలు సిద్ధమయ్యాయి.

**2007 రీ లోడింగ్, నాడూ నేటి సీనే – అదే రిపీట్ అయితే భారత్ దే ప్రపంచ కప్..!!**

జింబాబ్వేతో గెలుపే కాదు.. అంతకు మించి తొలుత జింబాబ్వే బ్యాటింగ్ చేస్తే వారు నిర్దేశించే లక్ష్యాన్ని ఓవర్ కు 14 పరుగుల చొప్పున చేధింజి విజయం నమోదు చేసుకోవాలి. లక్ష్యం 150 పరుగులు ఉంటే, భారత్ 11 ఓవర్లలోనే మ్యాచ్ ముగించాలి. అదే విధంగా భారత్ ముందుగా బ్యాటింగ్ చేస్తే కనీసం 220 నుంచి 250కి పైగా పరుగులు చేయాలి. అనంతరం ప్రత్యర్థిని 100–120 లేదా అంతకంటే తక్కువ స్కోర్‌కే కట్టడి చేయాలి. ప్రత్యర్థిని ఆలౌట్ చేస్తే ఓవర్లు ఆదా అవుతాయి కాబట్టి చీ==కి మరింత లాభం ఉంటుంది.సౌతాఫ్రికా.. వెస్టిండీస్ భారీగా రన్ రేటుతో ఉండటంతో.. సూర్య టీం వచ్చే రెండు మ్యాచుల్లో సాదా సీదా విజయం సాధిస్తే సరిపోదు. భారీ రన్ రేటుతో గెలిస్తేనే సెమీస్ కు అవకాశం ఉంటుంది. దీంతో.. ఇప్పుడు జింబాబ్వేతో మ్యాచ్ వేళ తుది జట్టు ఎంపిక.. ఆట తీరు.. ఫలితం.. రన్ రేటు పైన టీం తో పాటుగా ఫ్యాన్స్ లోనూ ఉత్కంఠ పెరుగుతోంది. అటు అహ్మదాబాద్ లో సౌతాఫ్రికా – వెస్టిండీస్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికా గెలుపు టీమిండియాకు అవసరం. లేకపోతే చివరి నిమిషం వరకు టెన్షన్ తప్పదు..

# పాండ్యా, అభిషేక్ మెరుపులు.. సెమీస్ రేసులో టీమిండియా..!

చావోరేవో పోరులో భారత జట్టు జూలు విదిల్చింది. టాపార్డర్ ఆకాశమే హద్దుగా చెలరేగి రికార్డు స్కోరందించగా.. జింబాబ్వేపై 72 పరుగులతో జయభేరి మోగించింది టీమిండియా. రికార్డు ఛేదనకు దిగిన ప్రత్యర్థిని వందలోపే ఆలౌట్ చేస్తుందనకుంటే.. కనీసం వంద పరుగుల తేడాతో అయినా గెలవలేదు. అయితే.. తొలిపోరులో దక్షిణాఫ్రికా చేతితో కంగుతిన్న టీమిండియా ఈ విజయంతో సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ ఏ నుంచి సఫారీ జట్టు సెమీస్‌కు అర్హత సాధించింది.లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8ను ఓటమితో ఆరంభించిన భారత్.. కీలకమ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తు చేసింది. అహ్మదాబాద్‌లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. చెపాక్‌లో ఆఫ్రికా జట్టుపై 72 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే.. వెస్టిండీస్‌పై 9 వికెట్లతో జయభేరి మోగించిన సఫారీ టీమ్.. గ్రూప్ ఏ నుంచి దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టింది. ఈ పరిస్థితుల్లో చివరి నాకౌట్ పోరు భారత్, కరీబియన్ జట్టుకు కీలకం కానుంది. గెలిచిన జట్టు ముందంజ వేస్తుంది. ఒకవేళ మ్యాచ్ రద్దైతే.. మెరుగైన రన్‌రేటున్న విండీస్ సెమీస్ బెర్తు పట్టేస్తుంది.రికార్డు ఛేదనలో జింబాబ్వే ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(97 నాటౌట్), మరుమని(20)లు దూకుడగా ఆరంభించారు. పవర్ ప్లేలో వీరిద్దరూ స్కోర్ 40 దాటించారు. అయితే.. అక్షర్ పటేల్ ఓవర్లో మరుమని షాట్ ఆడి ఇషాన్ చేతికి చిక్కాడు. కాసేపటికే డియన్ మైయర్స్(6)ను వరుణ్ చక్రవర్తి వెనక్కి పంపాడు.అనంతరం కెప్టెన్ సికిందర్ రజా(31) జతగా బెన్నెట్ పెద్ద షాట్లు ఆడాడు. వీరిద్దరూ సిక్సర్లతో అలరిస్తూ అర్ధ శతకం భాగస్వామ్యం నెలకొల్పారు. రజాను అర్ష్‌దీప్ ఔట్ చేయగా.. మున్యోగా(11), ముసెకివా(7)లు త్వరగానే పెవిలియన్ చేరారు. ఓవైపు వికెట్లు పడుతున్నా బెన్నెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టు చెలరేగి సెంచరీకి చేరువయ్యాడు. కానీ.. ఓవర్లో సిక్స్, ఫోర్ రావడంతో జింబాబ్వే 184కే పరిమితమైంది.

చితక్కొట్టిన పాండ్యా, అభిషేక్

సెమీస్ ఆశలు నిలవాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో భారత క్రికెటర్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(55) ఫామ్ చాటుకుంటూ అర్ధశతకంతో రెచ్చిపోగా.. వచ్చినవాళ్లు వచ్చినట్టు వీరంగం సృష్టించారు. జింబాబ్వే బౌలర్లను హడలెత్తిస్తూ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(33), తిలక్ వర్మ(44 నాటౌట్)లు కసిదీరా కొట్టగా.. హార్దిక్ పాండ్యా(50 నాటౌట్) తన స్టయిల్ విధ్వంసంతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. టాపార్డర్ సహా మిడిల్ మెరుపులతో టీమిండియా పొట్టి ప్రపంచకప్‌లో 256తో వ్యక్తిగత రికార్డు(గతంలో 220 రన్స్)ను బ్రేక్ చేసింది.



# ఆశలు సజీవం.. జింబాబ్వేపై భారత్ భారీ విజయం



సమిష్టిగా బాదిన బ్యాటర్లు

అభిషేక్, హార్దిక్ అర్ధ శతకాలు

బెన్నెట్ పోరాటం వృథా

చెన్నై: పొట్టి ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు జూలు విదిల్చింది. సెమీస్ రేసులో నిలవాలంటే భారీ విజయం అవసరమైన వేళ.. చెన్నైలో జరిగిన గ్రూప్–1 సూపర్–8 మ్యాచ్‌లో జింబాబ్వేను 72 పరుగుల తేడాతో ఓడించి ఆ ఆశలను సజీవంగా ఉంచుకుంది. బ్యాటర్లు సమిష్టిగా బాదడంతో ప్రత్యర్థి ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా.. 20 ఓవర్లకు 4 వికెట్ల నష్టానికి 256 పరుగుల రికార్డు స్కోరు చేసింది.అభిషేక్ శర్మ (30 బంతుల్లో 55, 4 ఫోర్లు, 4 సిక్సలు), 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' హార్ధిక్ పాండ్యా (23 బంతుల్లో 50 నాటౌట్, 4 సిక్సలు), తిలక్ వర్మ (16 బంతుల్లో 44 నాటౌట్, 3 ఫోర్లు, 3 సిక్సలు) వీరవిహారం సృష్టించారు. రికార్డు ఛేదనలో జింబాబ్వే.. బ్రియాన్ బెన్నెట్ (58 బంతుల్లో 93 నాటౌట్, 8 ఫోర్లు, 6 సిక్సలు) పోరాటంతో 20 ఓవర్లకు 184/6 రన్స్ చేసింది. సికందర్ రజా (21 బంతుల్లో 31, 2 ఫోర్లు, 2 సిక్సలు) అతడికి అండగా నిలిచాడు. బ్యాట్‌తో సత్తాచాటిన టీమ్ఇండియా.. బంతితో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేక చతికిలపడింది.

బెన్నెట్ పోరాటం

రికార్డు ఛేదనలో మెరుపులేమీ లేకపోయినా జింబాబ్వే బ్యాటర్లను ఔట్ చేసేందుకు భారత బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. బుమ్రాతో పాటు స్పిన్నర్లు వరుణ్, అక్షర్ సైతం తీవ్రంగా నిరాశపరిచారు. పవర్ ప్లేలో ఆ జట్టు వికెట్లేమీ కోల్పోకుండా పట్టుదలగా ఆడింది. 2 సిక్సలు కొట్టిన మరుమాని (20), బెన్నెట్ తొలి వికెట్‌కు 44 రన్స్ జోడించారు. పవర్ ప్లే తర్వాత అక్షర్.. మరుమానిని బోల్తా కొట్టించి తొలి వికెట్ పడగొట్టాడు. కానీ అతడే వేసిన 9వ ఓవర్లో బెన్నెట్.. 6, 4, 6తో 19 రన్స్ రాబట్టాడు.వరుణ్ తన రెండో ఓవర్లో మైయర్స్ (6)ను వెనక్కి పంపాడు. అయితే బెన్నెట్.. బుమ్రా ఓవర్లో సిక్స్‌తో టోర్నీలో మూడో హాఫ్ సెంచరీని నమోదుచేశాడు. ఇక అక్కడ్నుంచి రజా అండతో భారత బౌలర్లను ఆటాడుకున్నాడు. దూబె ఓవర్లో 6, 4, 4, 6తో ఏకంగా 26 రన్స్ వచ్చాయి. రజా, బెన్నెట్ మూడో వికెట్‌కు 72 రన్స్ జోడించి ఆ జట్టును భారీ ఓటమి నుంచి తప్పించారు. బెన్నెట్ ఆఖర్లో 3 పరుగుల తేడాతో సెంచరీని కోల్పోయాడు.

ఎవ్వరూ తగ్గలే..

తప్పక గెలవాల్సిన మ్యాచ్ అవడంతో క్రీజులోకి వచ్చిన భారత బ్యాటర్లందరూ దూకుడుగానే ఆడారు. ఎక్కువసేపు క్రీజులో లేకున్నా రెండు భారీ సిక్సలు, ఓ బౌండరీతో శాంసన్ (24) ఇన్నింగ్స్‌ను ధాటిగానే ఆరంభించాడు. తన శైలికి భిన్నంగా ఆరంభంలో ఆచితూచి ఆడిన అభిషేక్.. శాంసన్ నిష్క్రమణ తర్వాత బ్యాట్‌కు పనిచెప్పాడు. ఇషాన్ కిషన్ (24 బంతుల్లో 38, 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి రెండో వికెట్‌కు 42 బంతుల్లోనే 72 రన్స్ జతచేశాడు. బెన్నెట్ 9వ ఓవర్ రెండో బంతికి లాంగాన్ మీదుగా అభిషేక్ కొట్టిన సిక్స్‌తో టీమ్ఇండియా వంద పరుగుల మైలురాయిని అందుకుంది. రజా ఓవర్లో సింగిల్‌తో ఈ టోర్నీలో అతడు తొలి అర్ధ శతకాన్ని అందుకున్నాడు.26 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔట్ అయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్న ఇషాన్.. రజా ఓవర్లో 4,6 బాదినా నాలుగో బంతికి గరవకు క్యాచ్ ఇచ్చాడు. వస్తూనే బౌండరీతో పరుగుల వేటను మొదలెట్టిన సూర్య (13 బంతుల్లో 33, ఫోర్లు 3 ఫోర్లు, 2 సిక్సలు).. మపొస ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టాడు. కానీ అదే ఓవర్లో ఐదో బంతికి లాంగాన్‌లో అభిషేక్ ఇచ్చిన క్యాచ్‌ను రజా ఒడిసిపట్టుకున్నాడు. ధాటిగా ఆడే క్రమంలో సూర్య నిష్క్రమించినా అతడి స్థానంలో వచ్చిన తిలక్‌తో కలిసి హార్ధిక్ జింబాబ్వే బౌలర్లను ఆటాడుకున్నారు. 15 ఓవర్లకే 176/4తో ఉన్న టీమ్ఇండియా.. ఆఖరి ఐదు ఓవర్లలో 80 రన్స్ రాబట్టింది.

సెమీస్ రేసు ఇలా..

ఈ విజయంతో గ్రూప్–1 పాయింట్ల పట్టికలో వెస్టిండీస్‌తో కలిసి 2 పాయింట్లతో భారత్ సమంగా ఉన్నా నెట్న్ రేట్ విషయంలో విండీస్(+1.791) టీమ్ఇండియా (–0.100) కంటే మెరుగ్గా ఉండి రెండో స్థానంలో నిలిచింది. రెండు ఓటములతో జింబాబ్వే టోర్నీ నుంచి నిష్క్రమించగా దక్షిణాఫ్రికా సెమీస్‌కు అర్హత సాధించింది. వచ్చే ఆదివారం వెస్టిండీస్‌తో జరుగబోయే మ్యాచ్‌లో ఎవరు గెలిస్తే వారు గ్రూప్–1 నుంచి సెమీస్‌కు అర్హత సాధిస్తారు. ఒకవేళ వర్షం కారణంగా మ్యాచ్ రైద్దతే మాత్రం అప్పుడు నెట్ రన్‌రేట్ కీలకం కానుంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లకు 256/4 (అభిషేక్ 55, హార్ధిక్ 50లి, రజా 1/29, మపొస 1/40);

జింబాబ్వే: 20 ఓవర్లకు 184/6 (బెన్నెట్ 97లి, రజా 31, అర్ష్‌దీప్ 3/24, అక్షర్ 1/35)

మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం



## మృణాల్‌తో సినిమా చేయాలనుంది: అల్లు అర్జున్ ఆసక్తికర పోస్ట్

టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్‌తో కలిసి పనిచేయాలనే తన ఆసక్తిని బయటపెట్టారు. 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి ఉత్తమ నటుడిగా 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్న సందర్భంగా మృణాల్ పంపిన అభినందనలకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఈ పరిణామంతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా వస్తుందా అనే చర్చ మొదలైంది.ఇటీవల జరిగిన 70వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్‌లో అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలోని నటనకు ఉత్తమ నటుడి అవార్డును గెలుచుకున్నారు. ఈ నేపథ్యంలో మృణాల్ ఠాకూర్ ఆయనకు ప్రత్యేకంగా పూల బొకేతో పాటు ఓ అభినందన సందేశాన్ని పంపారు. "ప్రతి ప్రదర్శనలో మీరు చూపించే అంకితభావం, తీవ్రత, అద్భుతమైన ప్రతిభ నిజంగా స్ఫూర్తిదాయకం. ఈ పురస్కారం మీకు అన్ని విధాలా అర్హమైనది" అని మృణాల్ తన సందేశంలో పేర్కొన్నారు.మృణాల్ పంపిన బొకే, నోట్‌ను తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో పోస్ట్ చేసిన బన్నీ, భవిష్యత్తులో ఆమెతో కలిసి పనిచేయాలనుకుంటున్నట్లు తెలిపారు. "థ్యాంక్యూ సో మచ్ మృణాల్ ఠాకూర్. మీ అభినందన చాలా మధురంగా ఉంది. ఎప్పటికైనా మీతో కలిసి పనిచేయాలని ఆశిస్తున్నాను" అని అల్లు అర్జున్ రాసుకొచ్చారు. ఇప్పటివరకు వీరిద్దరూ కలిసి నటించకపోవడంతో బన్నీ పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప' ఫ్రాంచైజీలోని మూడో భాగంతో పాటు లోకేశ్ కనగరాజ్, అట్లీ దర్శకత్వంలో సినిమాలకు సిద్ధమవుతున్నారు. మరోవైపు మృణాల్ ఠాకూర్, అడివి శేష్‌తో కలిసి నటించిన 'డకాయిట్' సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నారు.



## చేతిలో కోతి బొమ్మతో శ్రీవిష్ణు.. 'విష్ణు విన్యాసం' ఈవెంట్‌లో నవ్వులే నవ్వులు

టాలీవుడ్‌లో తనదైన కామెడీ టైమింగ్, సహజ నటనతో ప్రేక్షకులను అలరించే హీరో శ్రీవిష్ణు మరోసారి నవ్వుల పండుగ పంచడానికి సిద్ధమయ్యారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'విష్ణు విన్యాసం'. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కిన ఈ సినిమా రేపు ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. తాజాగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో శ్రీవిష్ణు తనదైన శైలిలో చేసిన సందడి అందరి దృష్టిని ఆకర్షించింది.

గ్రహస్థితి బాగోలేదట.. అందుకే కోతిని తెచ్చుకున్నానన్న శ్రీవిష్ణు!

ఈవెంట్‌కు శ్రీవిష్ణు చేతిలో ఓ కోతి బొమ్మను పట్టుకుని రావడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్టేజ్‌పై కూడా ఆ బొమ్మను వెంట ఉంచుకోవడంతో, దీని వెనుక ఉన్న కథేంటని అందరూ ఆసక్తిగా ఎదురుచూశారు. దీనిపై శ్రీవిష్ణు స్పందిస్తూ సరదా వ్యాఖ్యలు చేశారు. "ఈ రోజు నా గ్రహస్థితి బాగోలేదని ఓ జ్యోతిష్యుడు చెప్పారు. అందుకే ఓ కోతి పిల్ల పక్కన ఉంటే అంతా మంచి జరుగుతుందని సలహా ఇచ్చారు. అయితే నిజమైన కోతిని తెచ్చుకుంటే కరుస్తుందేమోనన్న భయంతో ఈ బొమ్మను తీసుకొచ్చాను" అంటూ నవ్వులు పూయించారు. తన సినిమాలో కూడా జాతకాలను, గ్రహాలను బలంగా నమ్మే వ్యక్తి పాత్రలో నటిస్తున్నానని ఆయన చెప్పడంతో, ఇది సినిమా ప్రమోషన్‌లో భాగమని అందరికీ అర్థమైంది. ఈ సరదా సంఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ... 'విష్ణు విన్యాసం' ఒక హిలేరియస్ జాయ్‌రైడ్ అని అభివర్ణించారు. నిర్మాత సుమంత్ నాయుడు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం వల్లే సినిమా ఇంత బాగా వచ్చిందన్నారు. దర్శకుడు యదునాథ్ మారుతీ రావు చాలా కూల్‌గా సినిమాను అద్భుతంగా తీశారని ప్రశంసించారు. హీరోయిన్ నయన్ సారికకు ఈ చిత్రంతో మంచి పేరు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమా ఫస్టాఫ్ యువతకు, సెకండాఫ్ కుటుంబ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని, థియేటర్ నుంచి బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ పూర్తి సంతృప్తితో వెళతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు నిర్మించిన ఈ చిత్రానికి రథన్ సంగీతం అందించగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. మొత్తం మీద సినిమా విడుదలకు ముందే ఈ కోతి బొమ్మ విన్యాసంతో శ్రీవిష్ణు మంచి బజ్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు.



## ఒక్కటైన విజయ్ దేవరకొండ, రష్మిక.. ఉదయ్‌పూర్‌లో ఘనంగా వివాహం

టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఎట్టకేలకు ఒక్కటయ్యారు. తమ రిలేషన్‌షిప్‌పై కొన్నేళ్లుగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ ఇవాళ ఉదయం 10:10 గంటలకు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరిగింది. విజయ్, రష్మిక మెడలో మూడు ముళ్లు వేసి ఆమెను తన జీవిత భాగస్వామిగా స్వీకరించారు.ఈ వివాహ వేడుక రెండు విభిన్న సంస్కృతుల కలయికగా అత్యంత వైభవంగా జరుగుతోంది. ఉదయం విజయ్ కుటుంబ పద్ధతిలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి తంతు పూర్తికాగా, ఈరోజు సాయంత్రం 4:30 గంటలకు రష్మిక కుటుంబ ఆచారాల ప్రకారం మరోసారి వివాహం నిర్వహించనున్నారు. ఈ వేడుకకు పలువురు సినీ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.పెళ్లికి ముందు జరిగిన వేడుకలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. బుధవారం జరిగిన హల్దీ వేడుక ఫొటోలను ఈ జంట ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా, అభిమానులు పెద్ద ఎత్తున స్పందించారు. అంతకుముందు 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో నిర్వహించిన క్రికెట్ మ్యాచ్ సైతం వైరల్‌గా మారింది. తమ అభిమాన జంట పెళ్లి చేసుకోవడంతో 'విరోష్' హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఉదయ్‌పూర్‌లో వివాహం చేసుకున్న ఈ జంట, మార్చి 4న హైదరాబాద్‌లో సినీ, రాజకీయ ప్రముఖుల కోసం భారీస్థాయిలో వెడ్డింగ్ రిసెప్షన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2O23/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com